# శిక్ష పడని నేరం



'చైతన్య' మాసపత్రిక ( పర్లాకిమిడి ). . . ఏప్రిల్, 1988

సిటీబస్ జోరుగా సాగుతోంది!

అది కాలేజీ టైం, ఆఫీసు టైం కూడా కావడంతో బస్ క్రిక్కిరిసి ఉంది. అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేల్చుకుని వెళ్తున్నట్లుగా కండక్టర్ ఆ జనాన్ని చీల్చుకుంటూ టిక్కెట్లు ఇస్తున్నాడు. అయితే భారతంలోని అభిమన్యుడు పద్మవ్యూహం లోంచి తిరిగి బయటకు రాలేదు. ఈ అభినవ అభిమన్యుడు మాత్రం వెనక్కివచ్చే అవకాశం లేక బస్ ముందుద్వారం లోంచి క్రిందికి దిగి తిరిగి వెనుక ద్వారంలోంచి బస్ లోపలికి వస్తున్నాడు.

రోజూ వచ్చే విద్యార్థులలో, ఉద్యోగస్తులలో పాస్‌లు ఉండేవారు అతనికి గుర్తే! అందువల్ల వాళ్ళని టిక్కెట్ కోసం అడగడం లేదు. టిక్కెట్ అడిగినప్పుడు మరికొంతమంది "పాస్..." అని అంటుంటే– అది చూపమని అడగకుండానే ఇతరుల దగ్గరికి వెళ్తున్నాడు. ఆ విధంగా అన్నవారి మీద నమ్మకం కావచ్చు, లేదా వాళ్ళు తీరిగ్గా పాసులు తీసి చూపించేవరకూ ఆగే వ్యవధి లేకపోవచ్చు. అంతా రొటీన్‌గా జరిగిపోతోంది.

బస్ వెనక డోర్ దగ్గర నీటుగా ముస్తాబైన ఒక యువకుడు నుంచుని ఉన్నాడు. లోపలికి రమ్మని ఒకటికి రెండుసార్లు కండక్టర్ అడిగినా రాలేదు. చేతిలో నోట్‌బుక్ ఉంది. అతని దగ్గరకి పోయి కండక్టర్ "టిక్కెట్..." అని అడిగాడు.

ఆ యువకుడు నిబ్బరంగా "పాస్!" అన్నాడు.

ఆ వ్యక్తిని చూస్తే కండక్టర్‌కి ఎందుకో అనుమానం వచ్చింది. "ఏదీ... పాస్ చూపించు!" అన్నాడు.

"పాస్ ఉందంటే నమ్మకం లేదా?" అని ఎదురుప్రశ్న వేశాడు అతను.

"నమ్మకంతో పనేమిటి? పాస్ చూడడం నా డ్యూటీ!" అన్నాడు కండక్టర్ శాంతంగా.

"పాస్ చూడడం నీ డ్యూటీ అయితే– మరి, వాళ్ళనెందుకు అడగలేదు?" అని ఆ ప్రక్కగా ఉన్న విద్యార్థులను చూపిస్తూ అడిగాడు అతను.

ఆ వ్యక్తి వితండ వాదానికి కండక్టర్‌కి వళ్ళు మండింది.

"అదంతా నీకనవసరం మిస్టర్! నా డ్యూటీ గురించి చెప్పవలసింది నా అధికారులు– నువ్వు కాదు. పాస్ ఉంటే మర్యాదగా చూపించు. లేకుంటే టిక్కెట్ తీసుకో!" అన్నాడు కండక్టర్ కోపాన్ని అణచుకుంటూ.

"అదేం నడవదు... రూలంటే రూలే! ఒకరికి ఒక రూలూ, మరొకరికి ఇంకో రూలూ ఉండే రోజులు పోయాయి. సాంఘిక న్యాయం, సమానత్వం కోరే రోజులివి!

అందరి పాస్‌లూ చెక్ చెయ్యి... అప్పుడు నేనూ చూపిస్తాను!" అంటూ రెట్టించాడు రాజకీయ భావాలు కలిగిన విద్యార్థి.

ఈ కాణీ ఖర్చు లేని కాలక్షేపాన్ని చూసి ఆనందిస్తున్నారు బస్‌లోని ప్రయాణీకులు. నోరెత్తిన వారే లేరు.

"సరే! ముందు స్టేజీలో మొబైల్ కోర్టు ఉంది. ఈ సంగతేమిటో అక్కడే తేలుతుంది!" అన్నాడు కండక్టర్.

"తేలనీ! విద్యార్థుల శక్తి ఏమిటో అదికూడా తెలుస్తుంది!" అన్నాడు తను విజయం పొందిన విక్రమార్కుడి లాగ.

ఆ వ్యక్తి ఉచ్చరించిన 'విద్యార్థి' అన్న పదం తారకమంత్రం లాగా పనిచేసినట్లుంది. వెంటనే బస్‌లో ఉన్న మిగిలిన విద్యార్థులు- "ఆర్.టి.సి. డౌన్... డౌన్..! కండక్టర్ జులుం నశించాలి!" అంటూ నినాదాలు చేయడం, బస్ బాడీని చేతులతో బాదడం మొదలుపెట్టారు.

అనుకోని ఈ పరిణామానికి కొయ్యబారిపోయాడు కండక్టర్.

దానినుంచి తేరుకునే లోపలే తర్వాతి స్టాప్ వచ్చింది. దురదృష్టంకొద్దీ అది కాలేజీ స్టాప్ అయింది.

బస్ ఆగగానే చాలామంది విద్యార్థులు బిలబిలలాడుతూ దిగి బస్‌ని చుట్టుముట్టి నినాదాలు చేయడం మొదలుపెట్టారు.

ఈ అలజడికి కాలేజీలోని విద్యార్థులు కూడా పరుగు పరుగున బయటికి వచ్చారు.

మరీ ఉత్సాహవంతుడైన ఒక విద్యార్థి ఒక బస్ చక్రానికి గాలి తీసేయడం మొదలు పెట్టాడు. అదిచూసి మరికొందరు విద్యార్థులు నవ్వులూ, కేరింతలతో తమవంతుగా మిగిలిన మూడు చక్రాలలోని గాలిని తీసేశారు.

ఆ బస్‌లో వచ్చిన ప్రయాణీకుల్లో భావి రాజకీయ నాయకుడు కాగలిగిన లక్షణాలున్న ఒక విద్యార్థి దొమ్మరివాడు నిచ్చెనెక్కినంత సులువుగా చకచకా బస్ ఎక్కేశాడు. దానిమీద నుంచుని, మైక్ లేని లోటు కనబడకుండా పూర్తి కంఠంతో –

"సోదర విద్యార్థులారా..! ఆర్టీసీ అత్యాచారాలు రోజురోజుకీ ఎక్కువైపోతున్నాయి. కండక్టర్ల జులుం హద్దులు దాటుతోంది. ఈరోజు ఈ బస్‌లోని కండక్టర్ గౌరవనీయుడైన మన విద్యార్థిని దొంగని చూసినట్లు చూసి అవమానించాడు. ఈ ఘోరాన్ని మనం సహిస్తే, ఇంక మన స్టూడెంట్లకి పుట్టగతులుండవు. మన విద్యార్థి శక్తిని, మనలోని ఐక్యతనీ

నిరూపించి వీరికి తగిన బుద్ధి చెప్పాలి!" అంటూ ఆరితేరిన రాజకీయ నాయకుని ఫక్కీలో, ఆవేశంగా ఊగిపోతూ ఉపన్యాసం దంచడం మొదలుపెట్టాడు.

ఈ గోలతో రోడ్డుమీద ట్రాఫిక్ ఎక్కడిదక్కడ ఆగిపోయింది...

సముద్రంలో ద్వీపాల లాగా, జనం మధ్య బస్‌లు నిలిచిపోయాయి..!

అంతలో- ఎవరు సిగ్నల్ ఇచ్చారో తెలీదు కానీ, ఆగివున్న బస్‌ల మీద టపటపా రాళ్లవర్షం కురియడం మొదలుపెట్టింది. బస్ అద్దాలు పటపటా పగలడం, బస్‌లోని వారు భయంతో కేకలు వేస్తూ త్రోసుకుంటూ దిగడం, ఆ శబ్దాలను మించి విద్యార్థులు చేస్తున్న నినాదాలు, అంతా చూస్తుండగా మినీ రణరంగంగా మారిపోయింది. 'సందట్లో సమారాధన' అన్నట్లుగా ఒక విప్లవవాది ఒక బస్‌కి నిప్పంటించాడు.

అటువంటి సమయాల్లో నిమిషాల మీద బస్‌లను తగలపెట్టడానికి అవసరమైన సామాగ్రి ఎక్కడినుంచి వస్తుందో దేవుడికే తెలియాలి.

యుద్ధరంగం లోని పరిస్థితి ఈ స్థాయిలో ఉండగా పోలీసులు రంగప్రవేశం చేశారు. ముందు పోలీసు వ్యాన్‌ల కూతలు వినిపించాయి. ఆ వెనుకనే నిమిషాల మీద వ్యానులు వచ్చాయి. వాటిలోంచి పోలీసులు లాఠీలతో గబగబా దూకి, "పొండి... పొండి!" అంటూ అరుస్తూ జనాన్ని తరమడం మొదలుపెట్టారు.

పోలీసులను చూసేసరికి జనంలో ఉత్సాహం ఎక్కువైంది. రసవత్తర ఘట్టం ప్రారంభమైంది. పోలీసులను చూసి జనం అపహాస్యంగా ఈలలూ మొదలుపెట్టారు. కొందరు వారికి వచ్చిన అతిసున్నితమైన పదునైన భాషను ఉపయోగించి వ్యాఖ్యానాలు మొదలుపెట్టారు. వెనుక ఉన్న జనంలోంచి పోలీసుల మీదికి రాళ్లు పడడం ప్రారంభమైంది.

బెదిరింపులు లాభం లేకపోయేసరికి- పోలీసులు లాఠీఛార్జ్ మొదలుపెట్టారు.

జనం మాత్రం తక్కువ తిన్నారా? వాళ్ళు దగ్గరకు రాగానే కాలేజీ కాంపౌండ్‌లోకి పారిపోవడం, వాళ్ళు దూరం కాగానే మళ్లీ బయటికి వచ్చి గురిచూసి రాళ్లు వేయడం! ఈ దాగుడుమూతలు కొంతసేపు అయ్యాక, ఇంక లాభం లేదనుకుని, బాష్పవాయు ప్రయోగం మొదలుపెట్టారు పోలీసులు.

బాష్పవాయువు కంటే తీవ్రమైన హెచ్చరికలను మైకులోంచి వదలసాగారు.

యుద్ధం ఈ స్థితిలోకి వచ్చినపుడు జనం చెల్లాచెదురుగా పారిపోయారు. జనం చెల్లాచెదురయ్యాక గ్రహణం విడిచిన చంద్రుడిలాగా కొంచెంకొంచెంగా తగలబడుతున్న బస్ దర్శనం అయింది. అంతకుముందు- పాపం... దాని కండక్టర్, డ్రైవర్ మంటల్ని

ఆర్పాలని ప్రయత్నిస్తుంటే... వారు శ్రమపడడం సహించలేని 'బుద్ధిమంతులు' వారిని కొట్టి ఆ ప్రయత్నం ఫలించకుండా చేశారు. ఈలోగా ఏ పుణ్యాత్ముడో చేసిన ఫోన్ మూలంగా ఫైర్ ఇంజన్ వచ్చి బస్ పూర్తిగా తగలబడకుండా కాపాడింది.

రెండు గంటల తర్వాత పరిస్థితి మళ్లీ యధాపూర్వ స్థితికి చేరుకోసాగింది.

జరిగిన దారుణానికి మౌనంగా సాక్ష్యం ఇస్తూ నిలుచుండిపోయింది బస్. జనంలో అసలు జరిగిందేమిటో ఎవరికీ అర్థంకాలేదు. "అసలేం జరిగింది?" అంటూ అన్నివైపుల నుండి ప్రశ్నలే! సమాధానాలు మాత్రం శూన్యం!

ఊహించగల కొందరు మాత్రం- "బస్సువాళ్ళూ, స్టూడెంట్సూ కొట్టుకున్నారట!" అని, మరికొందరు- "ఆ కాలేజీ విద్యార్థులు సమ్మె చేస్తున్నారట!" అనీ- ఈ విధంగా తోచిన విధంగా చెప్పుకోసాగారు.

కొందరు ఆశావాదులు- "ఈ విద్యార్థులలో ఎంతటి ఐకమత్యమో చూడండి! ఈ శక్తిని మీరు నిర్మాణాత్మక కార్యక్రమాలకు ఉపయోగిస్తే మన దేశం ఎంత బాగుపడుతుందో!" అని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తే, మరికొందరు నిరాశావాదులు- "ఈ శక్తిని సమీకరించగలిగే నాయకులు ఎక్కడున్నారండీ... తమ స్వార్థం కోసం సాగించే ఉద్యమాల్లో వీళ్ళని పావుల లాగా వాడుకుంటున్నారు కానీ! అందుకే మనదేశం ఇలా ఏడుస్తోంది!" అని పెదవి విరవసాగారు.

ఏమైతేనేం... ఆ ఘట్టం ముగిసింది!

విద్యార్థులు ప్రవర్తించిన తీరుపట్ల ఆర్టీసీ ఉద్యోగులకు తగని ఆగ్రహం కలిగింది. వారి యూనియన్లు అత్యవసర సమావేశాలు జరిపాయి. అందులో విద్యార్థుల చర్యను వ్యతిరేకిస్తూ మర్నాడు బస్సులను నడపకూడదనే నిర్ణయం తీసుకోబడింది.

మర్నాటిదాకా అయితే వేడి చల్లారుతుందనీ, వెంటనే ఎక్కడి బస్‌లని అక్కడే ఆపివేయాలని యువతరం ఉద్యోగులు పట్టుపట్టారు. అంతటితో ముందు తీసుకున్న నిర్ణయం వీగిపోయింది.

ఆర్టీసీ ఉద్యోగుల అకస్మిక నిర్ణయం ఆఘమేఘాల మీద నగరంలో తిరుగుతున్న అన్ని బస్‌లకూ నిముషాల మీద అందింది. ఏ వైర్‌లెస్ ద్వారా ఈ వార్తను పంపారో ఆ దేవుడికే తెలియాలి. పంపినవారికి తెలిసినా మనకు చెప్పరుగా!

ఉద్యోగుల నిర్ణయం తు.చ. తప్పకుండా నిముషాల మీద అమలు జరిగింది. మధ్యాహ్నం మూడుగంటల నుంచి ఎక్కడి బస్‌లు అక్కడే ఆగిపోయాయి.

స్కూల్స్ వదిలిపెట్టిన పసిపిల్లలు పాలుగారే బుగ్గలతో ఎండలో నిలబడి ఇంటికి పోయే దారి తెలియక పడిన ఆందోళన వర్ణనాతీతం! మరీ చిన్నపిల్లలు ఆ ఆందోళనని తట్టుకోలేక బిగ్గరగా ఏడవసాగారు. అసలే సంచెడు పుస్తకాల భారం! దానికితోడు ఈ మరో భారం! ఇంక బస్‌లు, రైళ్లు దిగి ఊర్లోకి వెళ్లవలసిన ప్రయాణీకుల సంగతి, ఆఫీసులు, ఖార్ఖానాల నుంచి తిరిగివస్తున్న ఉద్యోగులు పడిన బాధ పగవాళ్ళకి కూడా వద్దనిపిస్తుంది. ఈ అవకాశం తీసుకుని ఆటోలు, టాక్సీలు, రిక్షాలు తమ ఛార్జీలను చుక్కలకి తాకించాయి. వాటిని ఇద్దామన్నా, అసలు అవి దొరకడమే గగనమయింది.

టిక్కెట్ లేకుండా ప్రయాణం చేయడం నేరం! ఒకవేళ పాస్ ఉంటే అడిగినప్పుడు చూపెట్టక పోవడం కూడా నేరమే! ఆ నేరాన్ని సమర్థిస్తూ మిగిలిన విద్యార్థులు అలజడి చేయడం, బస్సుల మీద రాళ్లు వేయడం, తగలబెట్టడం అన్నీ నేరాలే!

దీనిని పురస్కరించుకుని, బస్ ఉద్యోగులు అకస్మాత్తుగా బస్‌లను నిలిపివేయడం చట్టప్రకారం నేరం కాకపోవచ్చు కాని, నైతికంగా ప్రజల పట్ల పెద్ద నేరం! ఈ నేరాలన్నిటికీ శిక్షలు పడవచ్చు- పడకపోవచ్చు. అది వేరే సంగతి! కాని, ఏ నేరమూ చేయని అమాయక ప్రజలు అనవసరంగా అష్టకష్టాలు పడడం ఎంత దారుణం? ఏ నేరమూ చేయనివారికి ఎందుకీ శిక్ష? ప్రదర్శకులు విసిరిన రాళ్లు తగిలి, పగిలిన అద్దాలు గుచ్చుకుని, పోలీసులు జరిపే లాఠీఛార్జీలలో దెబ్బలు తిని, జరిపే కాల్పులలో ప్రాణాలు కోల్పోయి బాధపడే వారెందరు? నిత్యమూ మూగగా జనాన్ని మోస్తూ, వారు చేరవలసిన స్థలాలకి చేరవేస్తూ ఉంటే బస్‌లని తగలపెట్టడం- ప్రజాధనాన్ని ధ్వంసం చేయడం ఎంతటి నేరం?

నిష్కారణంగా చేయని నేరాలకు శిక్షలు విధిస్తున్న ఈ నేరస్తులను పట్టుకునేదెవరు? అన్నీ ప్రశ్నలే... సమాధానాలు మాత్రం శూన్యం!

శిక్ష పడని నేరం, అమాయకులకు బాధలు కల్పించడం ఒక్కటేనేమో!

'చైతన్య' మాసపత్రిక ( పర్లాకిమిడి ). . . ఏప్రిల్, 1988